


హైదరాబాద్ వార్త

# మోగిన బడిగంట

- -స్కూల్‌బాట పట్టిన విద్యార్థులు
- -సర్కారు బడుల్లో ఉచితంగా యూనిఫామ్,బుక్స్ పంపిణీ
- -స్కూళ్లు-కాలేజీ బస్సుల్లో ఆర్టీవో అధికారుల తనిఖీలు



లంగర్‌హౌజ్‌లోని స్కూల్‌లో విద్యార్థులకు యూనిఫాం,బుక్స్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి, డీఈవో రోహిణి

**హైదరాబాద్, జూన్ 12,ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పున: ప్రారంభమ య్యాయి. ప్రభుత్వ, ప్రవేట్ రెసిడెన్షియల్ అన్నిర కాల విద్యాసంస్థలు తెరుచుకున్నాయి. 48రోజుల పాటు వేసి సెలవుల అనంతరం పిల్లలు ఉత్సా హంగా బడికి చేరుకున్నారు. ఈసందర్భంగా ప్ర భుత్వ పాఠశాలల్లో తరగతి గదులను అలంకరించి ,ప్రవేశ ద్వారాలకు మామిడి తోరణాలు ,బెలున్లతో అలంకరించి విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. అలాగే విద్యార్థులకు ఉచితం గా యూనిఫామ్, పాఠ్య పుస్తకాల పంపిణీ కార్య క్రమాలు చేపట్టారు. వాటిని మంత్రులు, ఎమ్మెల్యే లు ,ఇతర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేస్తున్నారు. ఈసందర్భంగా గురువారం గోల్కొండ మండలంలోని లంగర్ హౌస్ సయ్యద్ ముర్తుజా హుసేని మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో పాఠశాలల పున: ప్రారంభం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని విద్యార్థులకు యూనిఫాం, బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇచ్చి కోట్లాది రూపాలు ఖర్చు చేసి పాఠశాలల్లో వసతులు, మెరుగైన విద్య అందిస్తుందని అన్నా రు. కావున ప్రతి ఒక్క విద్యార్థి బాగా చదివి ఉన్న దా స్థానాలకు ఎదగాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యం నిర్దేశించుకుని బాగా చదివి ఐఏఎస్, ఐపీ ఎస్, ఇంజనీర్లు, డాక్టర్లు కావాలని ఆకాంక్షించారు. పిల్లలు బాగా చదివి మంచి స్థానంలో ఉన్నప్పుడే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బంధువులు, స్నేహితులు, తామున్న ప్రాంత ప్రజలు సంతోష పడతారని అన్నారు. సమాజంలో ఎంత డబ్బున్న, బంగారం ఉన్న చదువు లేనప్పు దు వ్యర్థమని అన్నారు. ప్రభుత్వం ప్రతి విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థి పై లక్ష రూపా యలకు పైగా ఖర్చు చేసి యూనిఫార్మ్, ఉపా ధ్యాయుల జీతాలు, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్ అందిస్తుంద న్నారు. ఏమైనా శుభకార్యాలు, ఫంక్షన్ పెట్టు కుంటే సెలవు రోజుల్లోనే పెట్టుకోవాలని లేకుంటే చదువులో వెనుక పడతారని అన్నారు. తరగతి గదుల్లో విద్యార్థుల హాజరు వంద శాతం ఉండా లని, తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రతిరోజు తప్ప నిసరిగా పాఠశాలకు వెళ్లేలా చూడాలని తల్లిదం డ్రులను కోరారు. అలాగే బడిబాట కార్యక్రమంలో అడ్మిషన్లు బాగా పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఆర్. రోహిణి, డిప్యూటీ ఈవో వెంకటేశ్వ ర్లు, డిప్యూటీ ఐఓఎస్ బషీర్, తహసిల్దార్ అహ ల్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫర్హాత్ ఉన్ని సా, రోఖియా తస్లీమ్, ఉపాధ్యాయులు తదితరు లు పాల్గొన్నారు.

**స్కూల్-కాలేజీ బస్సుల్లో ఆర్టీవో తనిఖీలు ..**

విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో ఆయా విద్యాసంస్థల బస్సులపై ఆర్టీవో అధికారులు దృష్టి సారించారు. గ్రేటర్ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని స్కూల్‌బస్సులపై వేటు వేస్తున్నారు. ఫిట్నెస్ కచ్చితంగా పాటించాలని ఆదేశాలు జారీ చేస్తున్నా రు. మరోవైపు రాజేంద్రనగర్‌లో, శంషాబాద్, మెయినాబాద్, శేరిలింగపల్లిలో స్కూల్ బస్సులు తనిఖీ చేపట్టారు. ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవర్ లైసెన్స్, ఫైర్‌సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

# ‘పబ్‌లు’ గలీజులే..!

- - విదేశీ సంస్కృతితో యువత చెడుదారి
- - అసాంఘిక కలాపాలు, మాదకద్రవ్యాలు
- - అర్ధరాత్రి దాటినా.. ఆగని ఎంజాయ్‌మెంట్
- - మిడ్‌నైట్ ప్రమాదాలకు ఇవే కారణం



**హైదరాబాద్,జూన్12, ప్రభాతవార్త:** పబ్బులు యువతను పక్కదారి పట్టిస్తుంది. అన్ని వ్యసనాలను పరిచయం చేస్తున్న ఈ విదేశీ సం స్కృతి అయిన పబ్బులే కారణంగా నిలుస్తుంది. ఒక్కో దేశ సంప్రదాయాలైన వాటిని ఇక్కడ ఏర్పా టుచేయడంతో పాశ్చాత్యపోకడలను ఆవంభిస్తుం దనే రుజువవుతున్నాయి. యూత్ ఎంజాయ్ మెంట్‌తో భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని సామాజిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అన్ని చెడు అలవాట్లను నేర్చుకుని కుటుంబాలను అప్రతిష్టపాలు చేస్తున్నారు. అంతేకాకుండా తాగి తందనాలడుతూ లగ్జరీ కార్లతో అతివేగంతో దూ సుకపోతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికశాతం రాత్రి వేళ ప్రమాదాలకు పబ్‌లే కార ణాలను పోలీసులు ఆయా సందర్భాల్లో తెలిపా రు. నగరంలోని పబ్బులు డ్రగ్స్, అసాంఘీక కలాపాలు, అసభ్య వస్త్రాలంకరణలతో ఆకర్షిస్తు న్నాయి. అర్ధరాత్రి యువతీయువకులు రోడ్లపైన్నే తిరుగుతూ ఎంజాయ్ అనే ముసుగును తగిలిస్తు న్నారు. ఇదంతా నగర పోలీస్ యంత్రాంగానికి తెలిసిన కఠిన చర్యలు తీసుకోవాల్సిన ఉదంతాలు లేకపోయాయి. అప్పుడోఇప్పుడో ఎదైన చిన్న ఘటన జరిగితే పోలీసులు హడావిడి చేయడం త ర్వాత వదిలేయడం దశాబ్దం నుంచి నడుస్తుంది. మరో ఇరవైముప్పై ఏళ్లలో మరింత దారుణంగా విస్తరించే ప్రమాదముందని విశ్లేషకులు హెచ్చరిస్తు న్నారు. ఇప్పటికే ఎంజాయ్ అంటే గబ్బులే అనే విధంగా యువత భావిస్తున్నారని చెబుతున్నారు.

**మద్యం మత్తులో మరింత విచ్చలవిడిగా..**

నగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదా పూర్, గచ్చిబౌలి, హైటెక్‌సిటీ, రాయదుర్గం, ఫిలింనగర్‌తో పాటు ఆయా సంపన్నవర్గాలు ఉండే ప్రాంతాల్లోనే అధికంగా పబ్బులు ఉంటా యి. అయితే ధనవంతుల పిల్లలే అధికంగా కనిపి స్తుంటారు. హైరేంజ్ ఎంజాయ్ కోసం రూ.లక్షల ఖర్చు చేస్తూ విషసంస్కృతిని అలవాటు చేసు కుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వికృతచేష్టలన్ని పబ్బుల్లో నడుస్తుంటాయి. స్వేచ్ఛ విహార లోకంగా అడిగేవారు ఉండకపోవడంతో మరింత విచ్చలవిడిగా ఎంజాయ్ చేస్తూ యువత గంజాయి, విదేశీ మద్యం, అమ్మాయిలు, అసభ్య నృత్యాలు, మాదకద్రవ్యాలు, వివాహేతర సంబం ధాలు ఇలా ఎన్నో వాటిని ఆస్వాధీస్తున్నారు. మత్తులో తూగుతూ తమని మర్చిపో వ్యహరిస్తు న్నారనే ఆరోపణలు వెలుగుచూస్తున్నాయి. గతం లో జూబ్లీహిల్స్‌లో పోలీసుల దాడిలో అధికశాతం డగ్స్ పట్టుబడింది తెలిసిందే. ఇలా ఎన్నో పబ్బు లు కూడా విదేశీయులు, నైజేరియన్లు అధికంగా సరఫరా చేస్తున్నారనే విషయాలు లేకపోలేదు. విషసంస్కృతిని సామాజికవేత్తలు పలుమార్లు గత ప్రభుత్వాలకు విన్నవించిన పట్టించుకోలేదు. రోజు రోజుకు క్రమంగా పెరుగుతున్న పబ్బుల సం స్కృతికి అడ్డుకట్ట పడేది ఎప్పుడనేది చర్చానీయం శంగా మారింది. అదేవిధంగా గతంలో రాత్రి వేళల్లో జరిగే ప్రమాదాలకు ఇవే కారణాలను పోలీ సులు చెబుతున్నారు. ఏ ప్రమాదమైన విచారిస్తే యువతీయువకులు డివైడర్ ఢీకొట్టడం, ఫ్లైవర్ లో ఫల్టీల ఘటనలే ఉంటున్నాయి. అతివేగంతో ఈ ప్రమాదాలు గతంలో ఇన్విస్టిగేషన్ అధికారు లు బహిరంగంగానే తెలిపారు. అంతేకాకుండా యువతులపై అత్యాచారాల ఉదంతాలు అనేకం. నాలుగైదు రోజుల క్రితం టాలీవుడ్ నటి ఓ పబ్‌లో దాడికి గురైంది.

**పబ్బుల ఉచ్చులో గ్రామీణ యువతులు..**

నగరంలో చదువుకోడానికి వచ్చిన విద్యార్థులు, ఎప్పుడు చూడని జిల్లాల నుంచి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పబ్బు కల్చర్‌కు అలవాటుపడుతున్నా రు. తలిదండ్రులు దూరంగా ఉండడంతో ఇష్టారా జ్యంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురవుతున్నా రు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ కంపెనీల సమీపంలో హాస్టళ్లలో ఉంటూ స్నేహితులతో ఎంజాయ్ కోసం ఒక్కసారిగా వెళ్లి ఉచ్చులో ఇరుక్కుపోతున్నారు. కుటుంబ పరిస్థితులు, కలలను మర్చిపోయి వ్యస నానికి దిగజారుతూ జీవితాలను పణంగా పెడుతు న్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన తోటి ఉద్యో గులతో ఉండడంతో లేనిపోని అలవాట్లకు ఆకర్షితు లవుతున్నారనే నిపుణులు చెబుతున్నారు. పబ్బు ల విష సంస్కృతికి ప్రభుత్వమే అడ్డుకట్ట వేయాల ని సామాజికవేత్తలు కోరుతున్నారు.

# చందానగర్‌లో సెల్లార్లలోనికి చేరిన వరదనీరు..

- -ట్రాక్టర్‌లతో తోడిన సిబ్బంది..
- -భారీ వర్షాలకు నీటమునిగిన ప్రాంతాలను సందర్శించిన జగదేశ్వర్‌గౌడ్, జోనల్ అధికారులు..



చందానగర్‌లో సెల్లార్లోకి నీరు చేరడంతో ట్రాక్టర్ ద్వారా నీటిని తోడిస్తున్న జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి, జూన్ 12 ప్రభాతవార్త**

నగరంలో పలుచోట్ల కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి కొన్ని ప్రాంతాలు నీటమునిగాయి. చందానగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్స్, వాణిజ్య సముదాయాల సెల్లార్లలోనికి భారీగా వరద నీరు చేరింది. ప్రధా నంగా చందానగర్‌లోని విజేత సూపర్ మార్కెట్ సెల్లార్లోనికి భారీగా నీరు చేరటంతో పదికి పైగా ట్రాక్టర్లతో సుమారు మూడుగంటల పాటు శ్రమించి నీటిని తోడారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు పెట్టారు.

**నీటమునిగిన ప్రాంతాలను సందర్శించిన జగదేశ్వర్ గౌడ్, జోనల్ అధికారులు..**

భారీ వర్షానికి నీటముంపుకు గురైన ప్రాంతాలలో సహాయక చర్యలు చేప ట్టాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, గ్రేటర్ హైదరాబాద్ స్టాడింగ్ కమిటీ సభ్యులు వి. జగదీశ్వర్ గౌడ్ అధికారులను కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిది లోని హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ నగర్, మదీనగూడ ప్రభుత్వ పాఠశాల ప్రాంతం, దత్తసాయికాలనీలో గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి నీటిముంపుకు గురైన ప్రాంతాలను జోనల్ కమిషన్ హేమంత్ బోర్కడే, డీసీ మోహన్‌రెడ్డి, జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారి శంకర్ నాయ క్, డిఈ శ్రీదేవి, ఏఈ ప్రతాప్‌లతో పాటు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ స్టాడింగ్ కమిటీ సభ్యులు జగదీశ్వర్ గౌడ్ పరిశీలించారు. అనంతరం చందానగర్ డివిజన్ పరిధిలని విజేత బిల్డింగ్ సెల్లార్‌లో వర్షపునీరు నిలిచిపోవడంతో స్థానిక నాయకుల సమాచారంతో ముంపు ప్రాం తం, వరద ప్రభావిత బిల్డింగ్ సెల్లార్లను స్థానిక నాయకులతో కలిసి జగదేశ్వ ర్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్లార్లలో ఉన్న వర్షపునీటితో పంపుల ద్వారా తోడి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరగా సమస్యను పరిస్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షులు అలీ, నియోజకవర్గ నాయకులు మిరియాల రాఘవరావు, ఉరిటి వెంకట్రావు, కట్ల శేఖర్‌రెడ్డి, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సౌందర్య రాజ్, సాయిగౌడ్, నర్సింగ్ రావు, గౌస్, హనీష్, నాగమహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వరద ముప్పు ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ పర్యటన

- -శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పరిశీలన
- -రాజేంద్రనగర్ ఉప్పరపల్లిలో వరద ముప్పుకు 12 గంటల్లో పరిష్కారం



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, జూన్ 12,ప్రభాతవార్త :** నగరంలో వరద ముప్పు ఉన్న పలు ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గురువారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షాలకు వరద ముంచె త్తిన దోయన్స్ కాలనీ, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాలను పరిశీలించారు. ఎగువ నుంచి వచ్చిన వరద సాఫీగా గోపి చెరువుకు చేరే మార్గం లేక శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం రోడ్డు, వర్షం నీరు గోపి చెరువు నుంచి వచ్చిన వరదతో లింగంపల్లి అండర్ పాస్ లో నీరు నిలి చిందని స్థానికులు వివరించారు. గోపి చెరువు, చాకలి చెరువులో నీటిమట్టం తగ్గించి వరద కట్టడి చేయవచ్చని సూచన చేశారు. అంతకు ముందు వరద ముప్పు ఉన్న కొండపూర్‌లోని కాసారోస్ అపార్ట్మెంట్ పరిసరాలను తనిఖీ చేసారు. వరద, మురుగు కాలువలను పూర్తి స్థాయిలో పునరుద్ధ రించాలని అధికారులకు సూచించారు. అనంత రం బాచుపల్లిలో పలు వరద కాలువలను పరిశీ లించారు.ఎస్ఎన్‌డిపి చేపట్టిన కాలువల నిర్మాణ పనులు వేగంగా జరగాలని అధికారులను ఆదేశిం చారు. అప్పటివరకు చెన్నం చెరువు నుంచి వచ్చే వరద రామచంద్రాపురం కాలనీలో నిలవకుండా దిగువన ఉన్న బాచుపల్లి చెరువులోకి చేరేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.


**12 గంటల్లో వరద ముప్పునకు పరిష్కారం..**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు నగరం లోని రాజేంద్రనగర్ మండలంలోని ఉప్పరపల్లి, శాస్త్రీపురం,పల్లె చెరువు ప్రాంతాలను బుధవారం సం దర్శించారు. ఉప్పరపల్లి లోని అశోక్ విహార్ కాలనీలో మురుగు, వరద కాలువలు లేక ఇబ్బం దులు పడుతున్న ప్రాంతాలను పరిశీలించగా ఎగువ నుంచి వచ్చే వరదలతో దాదాపు 5 అ పార్ట్మెంట్ల నివాసితులు 400ల కుటుంబాలు ఏడే ళ్లుగా అవస్థలు పడుతున్నామని కమిషనర్ ముం దు వాపోయారు. 150 మీటర్ల దూరంలో మూ సినదిని కలిపే ప్రధాన కాలువ ఉందని దానికి అనుసంధానంగా కాలువ ఏర్పాటు చేస్తే మా కాలనీ వరద, మురుగు ముప్పు తప్పుతుందని స్థానికులు పేర్కొన్నారు. మున్సిపాలిటీ నిధులు మంజూరయినా అక్కడి భూ యజమానులు పను లకు అనుమతించడం లేదని వాపోయారు. అపా ర్టుమెంటులో మురుగు నీరు నిలిచి పోతోందని కమిషనర్ కు చూపించారు. కాలువను తవ్వి సమ స్యను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చా రు. ఈ మేరకు గురువారం కాలువలను తవ్వించి సమస్యను పరిష్కరించారు. ఈసందర్భంగా7 ఏళ్ల సమస్యకువ12 గంటల్లో పరిష్కారం చూపారం టూ స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

**పల్లె చెరువు ఔట్లెట్ పరిశీలన.**

మైలార్‌దేవులపల్లిలోని పల్లె చెరువు ఔట్లెట్ ను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. గతంలో ఈ చెరువు కట్ట తెగి రోడ్డు మీద వరద ఉధృతికి వా హనాలు కొట్టుకుపోయి పలువురు మృతి చెందిన విషయాన్ని స్థానికులు కమిషనర్‌కు వివరించారు. ఆ దగ్గరలోని శాస్త్రీపురంలో ఎకరన్నర పార్కు క బ్జాను కమిషనర్ పరిశీలించారు. ఈపార్కుకు సం బంధించిన వివరాలు తీసుకొని ఆక్రమణ దారుల తో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు. పిల్ల లు ఆడుకునే స్థలాన్ని తమదని చెప్పి కబ్జా చేశార ని స్థానిక మహిళ కమిషనర్ ముందు వాపోయా రు. పార్కును పునరుద్ధరించాలని కోరారు. పరిశీ లించి లే ఔట్ ప్రకారం పార్కును కాపాడుతామని కమిషనర్ హామీ ఇవ్వడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# ‘క్వారీ’ గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి



**హైదరాబాద్, జూన్12, ప్రభాతవార్త:** ఆడుకుంటున్న చిన్నారులు అంతలోనే విగతజీవులుగా మారారు. ప్రమాదమని తెలియని వారికి ఓ క్వారీ గుంత మృత్యురూపంలో వచ్చి మింగేసింది. దీంతో గురు వారం అరుంధతినగర్‌లోని నివాసంలో విషాదఛాయలు అలుముకు న్నాయి. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన దుర్గా ప్రసాద్ (11), కొకురుకు చెందిన సుబ్రహ్మణ్యం (8)లు అరుంధతీ నగర్‌లో ఉన్న బంధువుల ఇంటికి వచ్చారు. అయితే బుధవారం ఇంట్లో నుంచి దుర్గాప్రసాద్, సుబ్రహ్మణ్యంలు బయటకు వెళ్లి ఆడుకుంటున్నారు. అక్కడే క్వారీ గుంత ప్రమాదకరంగా ఉంటుందని పిల్లలు గుర్తించలేకపోయారు. దీంతో ఆట ధ్యాసలో పడి ఇద్దరు గుంతలో పడ్డారు. పిల్లలు కనిపించకపోయేసరికి అంతటా వెతికిన ప్రయోజనం లేకపోవడంతో హుటాహుటీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో రెండు మృతదేహాలు బండబావి క్వారీలో ఉన్నట్లు సమాచారం అందడంతో ఘటనస్థలానికి వెళ్లి పరిశీలించగా వారివేనని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# నారాయణగూడలో అగ్ని ప్రమాదం


**సైఫాబాద్, జూన్ 12 ప్రభాతవార్త:** నారాయణగూడలోని ఎక్సెల్ హాస్పటల్‌లో గురువారం షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం సంభ వించింది. ఐదు అంతస్తులతో కొనసాగుతున్న ఈ హాస్పటల్ భవనం లో మొదటి, రెండోవ అంతస్తులో డాక్టర్స్ ఫ్యామిలి నివసిస్తున్నది. కాగా మొదటి అంతస్తులో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగా యి. దీంతో అప్రమత్తమైన డాక్టర్స్ ఫ్యామిలీ, సిబ్బంది కిందకు దిగా రు. హాస్పటల్‌లో రోగులు ఎవరూ లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో హాస్పటల్‌కు చేరుకుని మంటలను అదుపుచేశారు. షార్ట్ సర్క్యూట్ వల్లనే అగ్ని ప్రమాదం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తెలినట్టు అధికారులు తెలిపారు. ప్రమాదంలో 30 లక్షల రూపాయల విలువగల ఎసి, ఫర్నిచర్, ఇతరసామాగ్రి అగ్నికిహుతయ్యాయని బిల్డింగ్ యాజమాని చెప్పారు.

# హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా దాసరి హరిచందన



**హైదరాబాద్, జూన్ 12,ప్రభాతవార్త:** హైదరాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా దాసరి హరిచందన నియమితుల య్యారు. ఈమేరకు గురువారం ఛీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న అనుదీప్ దురిశెట్టి ఖమ్మం కలెక్టర్‌గా బదిలీ అ య్యారు. అలాగే జిహెచ్ఎంసిలో అడి షనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న స్నేహ షబరీష్ హన్మకొండ కలెక్టర్‌గా నియమితులయ్యారు. కాగా హరి చందన ప్రస్తుతం రోడ్లు భవనాల శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అంతకు ముందు నల్గొండ,నారాయణ పేట్ జిల్లాలకు కలెక్టర్‌గా,జిహెచ్ఎంసిలో అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహించారు.

# ఆషాడ బోనాల జాతరకు సిద్ధమవుతున్న శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయం



శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయ గోపురానికి రంగులు వేస్తున్న దృశ్యం.

**బేగంపేట జూన్ 12, ప్రభాతవార్త**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆల యం ఆషాడ బోనాల జాత రకు సిద్ధమవుతుంది. ఈ నెల 29న ఘటోత్సవంతో జాతర ప్రారంభమవుతుంది. ఇందుకు అనుగుణంగా అ మ్మ వారి ఆలయాన్ని సుం దరంగా ముస్తాబు చేస్తున్నా రు.ఇందులో భాగంగా అమ్మ వారి ఆలయాన్ని శుభ్రం చేసి రంగులు వేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆషాడ బోనాల జాతర 2025కు అమ్మ వారి ఆలయానికి దేశ విదేశాల నుంచి భక్తు లు పెద్ద సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు తగిన అన్ని రకాలైన ఏర్పాట్లును ఆలయ ఈ ఓ గుత్తా మనో హర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతు న్నారు.ప్రతి ఏటా లష్కర్ బోనాల జాతరకు రెండు తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలతో పాటు దేశ,విదేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మ వారిని దర్శించుకుంటారు.ఇదే సమయంలోరెండు తెలు గు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు మంత్రులు అన్ని శాఖల అధికారులు అమ్మ వారి దర్శనానికి తరలి వస్తుంటా రు.జాతర సమయంలో ఆలయం వద్ద చేపట్టాల్సి న చర్యలపై ఇప్పటికే దేవాదాయ శాఖాధికారులు చర్యలు ప్రారంభించారు. సికిం ద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో 29న ఘటోత్సవంతో ఉత్సవాలు (బో నాల జాతర) ప్రారంభం కాను న్నాయి.జులై 13న బోనాలు,14న రంగం (భవిష్యవాణి) అంబారీ ఊరేగింపు కార్య క్రమం ఉంటుంది.అమ్మ వారి దర్శనం కోసం ఏటేటా భక్తుల రద్దీ పెరుగుతుం డటంతో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పటిష్టమైన ఏర్పాట్లు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# స్కూల్ బస్సులపై కొరడా..

## -నాలుగు బస్సులను సీజ్ చేసిన మేడ్చల్ రవాణా శాఖ అధికారులు



స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

**పేట్ బషీరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త**

స్కూల్ బస్సులపై మేడ్చల్ ఆర్టిఏ అధికారులు కొరడా ఝుళిపించారు. వేసవి సెలవుల అనంతరం గురువారం పున ప్రారంభం కావడంతో స్కూల్ బస్సుల పై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలు నిబంధనల కు విరుద్ధంగా ఉన్న నాలుగు స్కూల్ బస్సులను సీజ్ చేశారు. బస్సులు ఫిట్నెస్ లేనివి కావడంతోపాటు ఫైర్ ఎగ్జిట్‌తో, డ్రైవర్ నైపుణ్యత ఇతర నిబం ధనలకు విరుద్ధంగా ఉన్న బస్సులను ఎట్టి పరిస్థితుల్లో రోడ్డుపై అనుమతిం చేది లేదని ఆర్టిఏ అధికారులు హెచ్చరించారు. ఆయా స్కూళ్ల యాజమా న్యాలు రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా బస్సులో విద్యార్థులను ఎక్కించుకుని వెళితే చట్టరీత్యా చర్యలు తప్పవని సూచించారు.

## మార్పు అభివృద్ధికి మలుపు



మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

**నిజాంపేట్, జూన్ 12, ప్రభాతవార్త**

జూన్ 2 నుండి సెప్టెంబర్ 9 తేది వరకు ఒక మార్పు అభివృద్ధికి మలుపు అనే నినాదంతో పలు సామూహిక పర్యావరణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి శుద్ధిపై అవగాహన కల్పించేందుకు క్లోరినేషన్ టెస్టింగ్ నిర్వహించబడిందని, ప్రజలకు క్లోరినేషన్ మాత్రలు పంపిణీ చేయడం ద్వారా వారు తాగునీటి స్వచ్ఛతను స్వయంగా పరీక్షించుకునే అవకాశం కల్పించామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించి పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. మునిసిపల్ సిబ్బంది ఇంటింటా తిరిగి డోర్ టు డోర్ అవగాహన కార్యక్రమం నిర్వహించి తడి చెత్త - పొడి చెత్త వేరు చేయడం యొక్క అవసరాన్ని వివరించి ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. అదే సమయంలో ఇంటి స్థాయిలో సేంద్రీయ ఎరువులు తయారు చేయడంపై అవగాహన కల్పించి, హోం కంపోస్టింగ్‌ను ప్రోత్సహించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో స్వయం సహాయ సంఘాల సభ్యులు, మునిసిపల్ సిబ్బంది, నిజాంపేట్ పౌరులు పాల్గొన్నారని తెలిపారు.

## పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన ఉప్పల శ్రీనివాస్‌గుప్త



పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న పిసిసి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఉప్పల శ్రీనివాస్‌గుప్త

**హైదరాబాద్, జూన్ 12 ప్రభాతవార్త :**

పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత తొలిసారి న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పిసిసి రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు కార్యకర్తల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లేలా, పార్టీ పటిష్ఠతకు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని కోరారు. అందుకు ఉప్పల శ్రీనివాస్‌గుప్త స్పందిస్తూ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు కష్టించి పనిచేస్తానని పేర్కొన్నారు. తనను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు మహేష్‌కుమార్ గౌడ్‌కి ఉప్పల శ్రీనివాస్‌గుప్త కృతజ్ఞతలు తెలిపారు.

## 14న లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారం

**హైదరాబాద్, జూన్ 12 ప్రభాతవార్త**




మొహమ్మద్ అబ్దుల్ జావిద్ పాషా

నాంపల్లి మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు, సికింద్రాబాద్ కోర్టు, మనోరంజన్ కాంప్లెక్స్‌లోని స్పెషల్ కోర్టు, పురానీ హవేలీలోని ఇంటిగ్రేటెడ్ ఫ్యామిలీ కోర్టుల నందు ఈనెల 14, శనివారం ఉదయం 10 గంటల నుండి జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (సెషన్స్ డివిజన్) కార్యదర్శి మొహమ్మద్ అబ్దుల్ జావిద్ పాషా తెలిపారు. ఈ లోక్‌అదాలత్ ద్వారా భార్య భర్తల మధ్యగల వివాహ సంబంధమైన వివాదములు, మనోవర్తి, విడాకులు, అత్తింటి వారి ఆరల్లో పిల్లల మనోవర్తి, చట్టరీత్యా రాజీకి అర్హతమైన అన్ని రకాల క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ తదితర కేసులు ఇరుపక్షాల అంగీకారముతో పరిష్కరించబడతాయని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించడానికి మొత్తం 30 బెంచ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో బెంచ్‌లో ఒక న్యాయాధికారి, ఒక న్యాయవాది ఉంటారు. నాంపల్లి క్రిమినల్ కోర్టులో 14 బెంచ్‌లను ఏర్పాటు చేశారు, సికింద్రాబాద్ కోర్టులో 7 బెంచ్‌లు, మనోరంజన్ కాంప్లెక్స్‌లోని ప్రత్యేక కోర్టులు, పురాని హవేలీలోని ఇంటిగ్రేటెడ్ ఫ్యామిలీ కోర్టులలో 9 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు మొహమ్మద్ అబ్దుల్ జావిద్ పాషా వివరించారు.

## ప్రభుత్వ పాఠశాలలే దేశాభివృద్ధికి పునాదులు

### -ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్




బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, జూన్ 12 ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలలే దేశాభివృద్ధికి పునాదులని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభ సందర్భంగా నల్లకుంట ప్రభుత్వ పాఠశాలలు నిర్వహించిన ప్రొఫెసర్ జయ శంకర్ బడిబాట యాత్రను స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలలే దేశాభివృద్ధికి పునాదులనీ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే దేశభక్తితో అన్ని రంగాల్లో ముందుంటారని, ప్రభుత్వము అన్ని రకాల వసతులతో ఉచిత విద్యను అందిస్తుందన్నారు. అనేక పోటీ పరీక్షలు రాసి నియామకమైన ఉపాధ్యాయులు ఈ పాఠశాలల్లో బోధిస్తున్నారని, అందుకే అందుకే మండల స్థాయిలో పదవతరగతి పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు కైవసం చేసుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు కడప సురేందర్, సుధాకర్ గుప్తా, నేత శీను, ప్రియాంక, అనురాధ, శ్రీనివాసరెడ్డి, యూనిస్, హరీష్, మోసెస్, సురేష్, పాఠశాల ఉప విద్యాధికారి శ్రవణ్ కుమార్, పాఠశాల ఇంచార్జ్ ఉపాధ్యాయులు ముత్యాల రవీందర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భవానీ, సీనియర్ ఉపాధ్యాయులు ఎం. నర్సింహారెడ్డిలతో పాటు ఉపాధ్యాయులు కవిత, సుజిత, భాగ్యలక్ష్మి, నాగమణి, దుర్గా, రమేష్ అనిల్ రెడ్డి, ప్రేమ్ కుమార్, విమల, సంధ్యారాణి, అనుపమ, ఉదయశ్రీ, అనిత, తల్లిదండ్రులు మరియు తదితరులు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు, రెండు జతల యూనిఫాం లు పంపిణీ చేశారు.



విద్యార్థుల పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



విద్యార్థులకు నోట్ పుస్తకాలు, యూనిఫామ్ లను అందజేస్తున్న నాగారం వేణు గౌడ్.



విద్యార్థులకు పుస్తకాలను పంపిణి చేస్తున్న కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, యూనిఫాంలు అందజేస్తున్న పురప్రముఖులు



మణికొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, యూనిఫాంలు అందిసేస్తున్న మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి తదితరులు.

## విద్యార్థులకు యూనిఫామ్స్,పుస్తకాలు పంపిణీ

**కూకట్పల్లిలో..**

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 12, ప్రభాతవార్త :** పాఠశాల విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా కూకట్పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ విద్యార్థులకు యూని ఫామ్, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కిషన్, ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

**న్యూ బోయినపల్లి లో..**

**కంటోన్మెంట్, జూన్ 12 ప్రభాతవార్తః** రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వా పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫార్మ్. అందజేస్తోందని, తాము చదువుకునే సమయంలో ఇలాంటి వసతులు లేవని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. న్యూ బోయినపల్లి పోలీసుస్టేషన్ సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి జంపన ప్రతాప్ ముఖ్య అతిధిగా హాజరై ప్రాథమిక. ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్. యూనిఫారం పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచెం. చాముండేశ్వరి. పాఠశాల ఉపాధ్యాయులు. గణేష్ టెంపుల్ కమిటీ సభ్యులు ముకేశ్ యాదవ్. వరప్రసాద్. అజిత్. టీటీడీ పవన్. చోటు. పాల్గొన్నారు.

**జాఫర్ గూడలో ...**

**మెహదీపట్నం, జూన్ 12, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలలోనే మెరుగైన విద్య అందుతుందని కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఏ బ్లాక్ అద్యక్షులు, గుడిమల్కాపూర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ నాగారం వేణు గౌడ్ తెలిపారు. గురువారం గుడిమల్కాపూర్ డివిజన్ జాఫర్ గూడ లో ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు ఆయన యూనిఫామ్, నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అడికి మల్లి కార్జున్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినోద్ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

**మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ...**

**నాచారం, జూన్ 12 ప్రభాతవార్త :** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మల్లాపూర్, ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలల్లో, నెహ్రూనగర్ ప్రాథమిక పాఠశాల, సుభాష్ నగర్ ప్రాథమిక పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను తెలంగాణ ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్‌తో కలిసి స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి రామారావు, ప్రధాన ఉపాధ్యాయులు యాదగిరి రెడ్డి, పద్మారావు, కొండల్ రెడ్డి, జ్యోతిర్మయి, స్థానిక నాయకులు చిగుళ్ల శ్రీనివాస్, పైళ్ల ప్రవీణ్, దుల్మిట్ట దయాకర్ రెడ్డి, ఉస్మాన్, నాగరం చంద్రశేఖర్, రమణ, రాజేష్ సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**తుకారం గేట్‌లో...**

**అడ్డగుట్ట, జూన్ 12 ప్రభాతవార్తః** బడిబాట కార్యక్రమంలో భాగంగా తుకారం గేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు నోట్ బుక్స్, యూనిఫారాలను అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పవన్ రాజ్, ఉపాధ్యాయులు రామలక్ష్మి, కరుణశ్రీ, సునీత, రాణి, గీతలు పాల్గొన్నారు

**ఖానాపూర్‌లో...**

**నార్సింగి, మే 12 ప్రభాతవార్త :** నిరుపేదల బిడ్డలు చదువుకునే ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యను అందించాలని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బడిబాటను పురస్కరించుకొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. అనంతరం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామేశ్వరం నర్సింహ్మా, మాజీ కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు భాగ్యమ్మ, పద్మజ, శివారాంరెడ్డి, మంజూల, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు లీలావతి, పుర ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వర్ణాల దిశగా ఆయు కుమార్, సాక్షి చౌన్‌కర్

**హైదరాబాద్, జూన్ 12,ప్రభాతవార్త:**

హుస్సేన్‌సాగర్ లేక్‌లో జరుగుతున్న మాన్‌సూన్ రెగట్టా చాంపియన్‌షిప్ గ్రీన్ ఫ్లీట్ విభాగంలో ఆయు కుమార్, సాక్షి చౌన్‌కర్ దూసుకెళ్తున్నారు. తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ దత్తత తీసుకున్న హర్యానాకు చెందిన ఈ ఇద్దరు సెయిలర్లు స్వర్ణ పతకాలను దాదాపు ఖాయం చేసుకున్నారు. ఆయు కుమార్ బాలుర విభాగంలో అగ్రస్థానంలో నిలవగా, బాలికల విభాగంలో సాక్షి మొదటి స్థానంలో ఉంది. ప్రతికూల వాతావరణం నేపథ్యంలో ప్రిన్సిపల్ రేస్ ఆఫీసర్ చతుర్వేది గురువారం ఉదయం సెషన్‌లో అతి కష్టం మీద ఒక్కో రేసును మాత్రమే నిర్వహించగలిగారు. అయితే ఈరేసు తర్వాత ఒక్కసారిగా నిరసనలు రావడంతో అండర్19 29ఇఆర్ విభాగంలో అగ్రస్థానంలో ఉన్న తంగై, దివాకర్‌లపై జ్యూరీ అనర్హత వేటు వేసింది. మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో తనుజ- శ్రవణ్ జోడీ తమ విజయ పరంపరను కొనసాగించింది. బాలికల విభాగంలో జరిగిన ఏకైక రేసులో ఆలియా సబ్రీన్, అండర్18 లేజర్ విభాగంలో శరణ్య యాదవ్ విజయం సాధించి అగ్రస్థానంలో నిలిచారు. సాయంత్రం పోటీలు పూర్తిగా రద్దయ్యాయి.



గెలుపొందిన అయుకుమార్, సాక్షిచౌన్‌కర్

## కళాకారుడి ప్రతిభకు దర్పణం బియాండ్ ది బ్రష్ చిత్రకళాప్రదర్శన : మామిడి హరికృష్ణ

**రవీంద్రభారతి, జూన్ 12 ప్రభాతవార్త :** చిత్రకళ అనేది కళాకారుడి ప్రతిభకు అద్దంపట్టే దర్పణమని, విషయం పట్ల పరిజ్ఞానం పట్టుకు నిదర్శనమన్న తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యే రీతిలో కళాకారుడు అందించే చిత్రరూప ప్రతిరూపమని ఆయన విశదీకరించారు. ఈమేరకు రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, పికాస్సో ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో బియాండ్ ది బ్రష్ పేరున ఈ నెల 22 నుండి 24 వరకు రవీంద్రభారతిలో ఉదయం 11నుండి రాత్రి 7గంటల వరకు నిర్వహించే చిత్రకళ ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను మామిడి హరికృష్ణ రవీంద్రభారతి ప్రాంగణం కళాభవన్‌లోని తన కార్యాలయంలో పికాస్సో సంస్థ వ్యవస్థాపక సంచాలకుడు బైరు రమేష్, టీచర్ శిరీష, చిత్రకళాకారులు ఎం.పూజమాధురి, శివ, పద్మావతి, రమ్య తదితరులతో కలిసి ఆవిష్కరించి ఈ ప్రదర్శన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బైరు రమేష్ మాట్లాడుతూ తమ ఎంతోమంది ఔత్సాహిక విద్యార్థులకు చిత్రకళలో సంపూర్ణ శిక్షణ ఇవ్వడం జరుగుతూనే ఉందని, ఇప్పటికే అనేక చిత్రకళా ప్రదర్శనలు రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. 3రోజుల పాటు జరిగే ఈ బియాండ్ ది బ్రష్ చిత్రకళ ప్రదర్శనకు పెద్దయెత్తున చిత్రకళ అభిమానులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి ఆస్వాదించి, కళాకారులను ప్రోత్సహించడంతో పాటు ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.



చిత్రకళ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మామిడిహరికృష్ణ, భైరిరమేష్, శిరీష తదితర చిత్రకళాకారులు

## విప్ ఆదిశ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలి : మున్నూరుకాపు సంఘం

**హైదరాబాద్, జూన్ 12,ప్రభాతవార్త:**

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ ఆది శ్రీనివాస్ కుమంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపునంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షులు చదల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జల్లేపల్లి వెంకటేశ్వరరావు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బొప్ప దేవన్నలు మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాటాత్లడుతూ రాష్ట్రంలో 40 లక్షల మందికిపైగా ఉన్నమున్నూరుకాపులంతా కాంగ్రెస్‌ను అధికారం లోకి తెచ్చేందుకు కష్టపడ్డారన్నారు. కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉంటున్న మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వకపోవడం దారుణమన్నారు. దీనిపై పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయంపై విన్నవించామన్నారు. మున్నూరుకాపు సామాజిక వర్గంపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టిపెట్టిందని, అధిష్టానం తగు న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారన్నారు. పదేళ్ల ప్రతిపక్షంలో ఉన్నా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేసిన ఆది శ్రీనివాస్‌కుమంత్రి పదవి ఇవ్వాలని అలాగే మున్నూరుకాపులకు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని కోరారు. త్వరలో తమ డిమాండ్ల సాధనకు ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేను, రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజ్ను కలిసి విన్నవిస్తామని తెలిపారు. ఒకవేళ ఆది శ్రీనివాస్ కు మంత్రి పదవి ఇవ్వనిపక్షంలో శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈసనూవేశంలో మున్నూరుకాపు సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్,మహేష్ తోపాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 33 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న వివిధ జిల్లాల మున్నూరుకాపు సంఘం నేతలు

## అక్రమ కేసులు పెట్టడం సరికాదు

### -ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 12 ప్రభాతవార్త:**

జంతు కళేబరాలను తమ బస్తీలలో వేయకుండా అడ్డుకున్న బిజెపి కార్యకర్తలు, యువకులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిందని పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్‌లో జరిగిన సంఘటనలకు సంబంధించి అరెస్టయి చంచల్‌గూడ జైలులో ఉన్న యువకులను గురువారంనఆయన ములాఖత్‌లో పరామర్శించారు. అనంతరం ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ కేవలం ఒక వర్గంవారిపైనే కేసులు నమోదు చేశారని అన్నారు. సంఘటనతో సంబంధం లేని వారిని కూడా అరెస్టు చేయడం సరికాదన్నారు. అక్రమ కేసుల గురించి పార్లమెంటులో ప్రస్తావించడమే కాకుండా ఎస్సి, ఎస్‌టి కమీషన్‌ను కూడా కలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బిజెపి నాయకులు శ్రీరాములు యాదవ్, మనోహర్‌రెడ్డి, భూపాల్, నిరంజన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



చంచల్‌గూడ జైలు వద్ద విలేకరులతో మాట్లాడుతున్న ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

## సనాతన ధర్మానికి ప్రతీకలు మన సాహిత్య, సాంస్కృతిక నృత్యాంశాలు



ప్రతిభకు పట్టాభిషేకం-సాంస్కృతికరత్న-పురస్కారాల'ను ప్రదానం చేస్తున్న దక్షిణమధ్యరైల్వే పూర్వ జనరల్ మేనేజర్ సి.రామకృష్ణ

**చిక్కడపల్లి, జూన్ 12 ప్రభాతవార్త:**

సనాతన ధర్మానికి ప్రతీకలు మన సాహిత్య, సాంస్కృతిక నృత్యాంశాలు నిలుస్తాయని దక్షిణమధ్యరైల్వే పూర్వ జనరల్ మేనేజర్ సి.రామకృష్ణ అన్నారు. గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుదిబండి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 'ప్రతిభకు పట్టాభిషేకం- సాంస్కృతికరత్న-పురస్కారాల' ప్రదానోత్సవ సభ రామరాజు ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. సభను యువకళావాహిని సంస్థ అధినేత లంకా లక్ష్మినారాయణ ప్రారంభించగా కార్యక్రమంలో కళాపోషకులు వడ్లకొండ వెంకటరావు, తెలుగు భాషా ప్రచారకర్త వి.శైలజ, కవయిత్రి, రచయిత్రి, నాట్యగురువు టి.వి.శిరీష, పద్మ శ్రీలత, నిర్వాహక సంస్థ ప్రధాన కార్యదర్శి వి.వి.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పురస్కారాలను సంగీతరత్న రామరాజు లక్ష్మీశ్రీనివాస్, సాహిత్య రత్న జానీభాషా, ఎం.సాయిసుప్రియ(వైజాగ్)లకు అందించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చెబియ్యం అమృత నిర్వహించిన భరతనాట్యం, శేషబట్టార్ ఆరోహి శరణ్య నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి.

## పర్యావరణ చట్టాలపై ప్రతి ఒక్కరిపై అవగాహన ఎంతైనా ఉంది : న్యాయవాది శ్రీధర్



కార్యక్రమంలో పాల్గొన్న భారత సుప్రీంకోర్టు న్యాయవాది పోతరాజు శ్రీధర్

**చిక్కడపల్లి, జూన్ 12 ప్రభాతవార్త:** పర్యావరణ చట్టాలపై ప్రతి ఒక్కరిపై అవగాహన ఎంతైనా ఉందని సుప్రీంకోర్టు న్యాయవాది పోతరాజు శ్రీధర్ అభిప్రాయపడ్డారు. గురువారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్. అంబేద్కర్ న్యాయ కళాశాలలో "పర్యావరణ చట్టాల గురించి అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పోతరాజు శ్రీధర్ మాట్లాడుతూ ప్రకృతి గురించి అందులో వుండే సున్నితమైన విషయాల గురించి వివరిస్తూ ప్రకృతిని కాపాడుకోవటం మన అందరి బాధ్యత అని అన్నారు. వాటికి సంబందించిన ముఖ్యమైన కేసులు గురించి వివరించారు. ప్రస్తుతం మారుతున్నా జీవనసైలి తో పర్యావరణం లో జరుగుతున్న విపరీత పరిణామాల గురించి వివరించారు. ఈ సందర్భంగా న్యాయవిద్యార్థులు అడిగిన పలు సందేహాలకు సమాధానం ఇవ్వటం జరిగింది. భావి నాయవాదులు పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ న్యాయ కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించారు.కార్యక్రమం లో కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదం

### -ఇద్దరికి గాయాలు

**అత్తాపూర్ జూన్12,ప్రభాతవార్త :** ఓ పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదం సంభవించిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసకుంది.స్థానికుల వివరాల ప్రకారం.... హైదర్ గూడ లోని సమృద్ధి ఎస్సార్ యూనిగ్యాస్ బంక్‌లో లీకైన ఎయిర్ పైపుకు వెల్డింగ్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చేల రేగాయి ఈ సంఘటనలో మాధవ్ , గోపి అనే ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తర లించినట్లు పేర్కొన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## హైదరాబాద్‌లో డబుల్‌బెడ్‌రూం కేటాయించి న్యాయం చేయండి

### -ప్రభుత్వానికి భాగ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి





ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్,శేషు ఇబ్రహీం తదితరులు

**హైదరాబాద్,జూన్ 12,ప్రభాతవార్త:**

జిల్లాలోని చాంద్రాయణ గుట్ట, యాకత్‌పురా, చార్మినార్, మలక్‌పేట్ నియోజకవర్గాలకు చెందిన 1,730 మంది లబ్దిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు తక్షణమే మంజూరు చేయాలని భాగ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షులు కానుగుల్ల శ్రీనివాస్, కార్యవర్గనభ్యులు శేషు మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 2న ఈ నియోజకవర్గాల లబ్దిదారులకు మొదటి జాబితా లోనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మహేశ్వరం మండలకేంద్రంలో కేటాయించిందని తెలిపారు. అయితే స్థానికులు రంగారెడ్డి జిల్లాలో హైదరాబాద్ లబ్దిదారులకు జి.ఓ. 10 ప్రకారం డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వడం కుదరదని కోర్టుకు వెళ్లగా ఈ నెల 9న హైకోర్టు తీర్పు ఇచ్చిందని వెల్లడించారు. దీంతో నాలుగు నియోజకవర్గాలకుచెందిన 1,730 మంది లబ్దిదారులకు అన్యాయం జరిగిందని దీంతో లబ్దిదారులంతా ఆందోళన చెందుతున్నారన్నారు. రెండు, మూడవ జాబితా లబ్దిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించారు కానీ, మొదటి జాబితా లో ఉన్న తమకు ఇప్పటి వరకు ఇండ్లు కేటాయించకపోవడంతో బాధాకరమన్నారు. 2ఏండ్లుగా తాము ఇండ్ల కోసం పోరాడుతున్నామని ప్రభుత్వం జోక్యం చేసుకొని, ఈ 1736 మంది లబ్దిదారులకు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తమనమస్యను 20 రోజుల్లోనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో డబుల్ బెడ్రూమ్ బాధితులు ఇబ్రహీం, శ్రీనివాస్, శ్రీవిద్య, సుభాష్, కౌనర్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మికుల నిర్మూలనకు కలిసికట్టుగా పోరాడదాం



ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చార్మినార్ వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్,తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి

**చార్మినార్,జూన్ 12 ప్రభాతవార్త :** బాల కార్మికుల నిర్మూలన కోసం మన మందరం కలిసి కట్టుగా పోరాడుదామని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్,తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. అశ్రిత,ఉమెన్ డెవలప్‌మెంట్,చైల్డ్ వెల్ఫేర్,ఎస్‌సిపిసిఆర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం చార్మినార్ వద్ద జరిగిన ప్రపంచ బాలల కార్మిక వ్యతిరేక దినోత్సవం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని ప్రతీ వ్యక్తి చదువుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని,చదువుతోనే మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు.బాల కార్మికుల రహిత సమాజాన్ని నిర్మిద్దామని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిసిపి లావణ్య.ఆర్‌జెడి మోతి, తెలంగాణ బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు కంచెర్ల వందన గౌడ్,మర్రిపల్లి చందన,బి ఆపర్ణ,గోగుల సరిత,ప్రేమలత అగర్వాల్, బి.వచన్ కుమార్, అశ్రిత డైరెక్టర్ నాగరాజు,అశ్రిత మేనేజర్ వి.పర్వతాలు,ప్రతి నిధులు శేఖర్,అనిత,పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు పులిపాటి రాజేష్ కుమార్,కె.వెంకటేష్,రవిరాజ్,రవి రాజ్,రాజుయాదవ్,బోయ నగేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.కాగా పలువురు విద్యార్దులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

## క్లాసిక్ ఫంక్షన్ హాల్ సీజ్

**మెహదీపట్నం, జూన్ 12, ప్రభాతవార్త :** చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని గుడిమల్కాపూర్ ఇన్ స్పెక్టర్ బైరి రాజు హెచ్చరించారు. చట్టానికి లోబడి ప్రతి ఒక్కరూ తమ పనులను చేసుకోవాలని కోరారు. గురువారం మొగల్ కా నాలా ప్రధాన రోడ్డు పివిఎస్ఆర్ బ్రిడ్జ్ పిల్లర్ నెంబర్ 104 వద్ద ఉన్నటువంటి క్లాసిక్ గార్డెన్ ఫంక్షన్ హాల్ ను కోర్టు ఆదేశాలతో గుడిమల్కాపూర్ పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ బైరి రాజు మాట్లాడుతూ... క్లాసిక్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో శుభకార్యాలు జరిగిన సమయంలో పెద్ద ఎత్తున డీజే ఏర్పాటు చేస్తుండడంతో స్థానికులకు సమస్యలు తలెత్తుతున్నాయని, దీంతో పోలీసులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో ఈనెల 3, 4వ తేదీలలో శుభకార్యాలు జరిగాయి. అయితే రాత్రి 12 గంటలు దాటినప్పటికీ డీజే సౌండ్స్ పెద్ద ఎత్తున మోగించారు. విధి నిర్వహణలో ఉన్నటువంటి పోలీసులు అక్కడికి వెళ్లి డిజె సాంగ్స్ ఆపాలని సూచించినప్పటికీ నిర్వాహకులు పట్టించుకోలేదు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి నివేదికను హైదరాబాద్ జిల్లా స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌కు సమర్పించగా, కోర్టు ఆదేశాలు క్లాసిక్ ఫంక్షన్ హాల్ ను సీజ్ చేయాలని రావడం జరిగిందని తెలిపారు.

## వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడం అభినందనీయం : డైరెక్టర్ మహమ్మద్ షకీల్



మంత్రి వివేక్ కు భారత రాజ్యాంగం పుస్తకాన్ని బహుకరిస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ షకీల్ తదితరులు

**మలక్ పేట ,జూన్ 12, ప్రభాతవార్త:** మంత్రిగా వివేక్ ను నియమించడం అభినందనీయమని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ షకీల్ పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వివేక్ ను మహమ్మద్ షకిల్ ఆధ్వర్యంలో మలక్ పేట్ నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి తరలి వెళ్లి వివేక్ కు భారత రాజ్యాంగం పుస్తకాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా షకీల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసే నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని పేర్కొన్నారు. పేద, బడుగు , బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫిట్‌నెస్ లేని కార్పొరేటర్ పాఠశాల, కళాశాల బస్సులను సీజ్ చేయాలి : శివకుమార్ గౌడ్



**తుర్కయంజాల్ జూన్ 12 ,ప్రభాతవార్త :** అఖిల భారత యువజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఫిట్నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని రీజినల్ ట్రాన్స్పోర్ట్ అధికారి సుభాష్ చంద్ర రెడ్డి కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ.... విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న తరుణంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంగా వందల సంఖ్యలో ప్రైవేటు, కార్పొరేటర్ పాఠశాలలు కాలేజీలు ఉన్నాయని, విద్యాసంస్థల యాజమాన్యాలు తమ బస్సులను కచ్చితంగా ఫిట్నెస్ చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అన్నారు. అంతేకాకుండా బస్సుల్లో ఫైర్ సేఫ్టీ, ప్రైమరీ హెల్త్ చెకప్ కిట్‌లు అందుబాటులో ఉంచాలని కానీ కార్పొరేట్ యాజమాన్యాలు ఇవి ఏమీ పట్టించుకోకుండా యదేచ్ఛగా రోడ్లపైకి వస్తున్నాయనీ వారు తెలిపారు. మోటార్ వెహికల్ ఆక్ట్ ప్రకారం నియమ నిబంధనలు పాటించని అన్ని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాల కళాశాలల బస్సులను వెంటనే సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు గోవర్ధన్, వివేక్, గండికోట శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## ఉమెన్స్ థీమ్ పార్కు పనులు వేగవంతం చేయాలి : కార్పొరేటర్



ఉమెన్స్ థీమ్ పార్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, అధికారులు.

**వనస్థలిపురం. మే.12.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ లోని సచివాలయనగర్ లో నిర్మిస్తున్న ఉమెన్స్ థీమ్ పార్కు పనులు వేగవంతం చేయాలని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అధికారుల ను కోరారు. గురువారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డి. సి. యాదయ్య లతో కలిసి కార్పొరేటర్ లచ్చిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ నాలలో పూడికతీత పనులు చేపట్టాలని, సాహెబ్ నగర్ శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, శివారు ప్రాంతాల్లో రోడ్లు, వీధి దీపాలు, పలు కాలనీలలో ఓపెన్ జిమ్ లు,సంక్షేమ సంఘ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని, శ్రీపురం కాలనీ కమాన్ నుండి శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ వరకు నూతన రోడ్డు నిర్మించాలని అధికారులను కోరారు. అందుకు స్పందించిన జోనల్ కమిషనర్ దశలవారీగా ప్రాధాన్యత ను బట్టి అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు రమేష్ బాబు,దామోదర్ రావు, నీలిమ,పున్న నాయక్,రవీందర్ రెడ్డి,రాజ్ కుమార్, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మహేష్ గౌడ్,శివ శంకర్, చందు,పవన్ కుమార్,సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



**తుర్కయంజాల్, జూన్ 12 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ శ్రీశ్రీ నగర్ కాలని లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాల యూనిఫామ్ మాజీ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య పంపిణి చేసారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఎటు వంటి ఇబ్బందులు లేవు పిల్లల తల్లిదండ్రులు పిల్లలకు సెల్ ఫోన్లు చేతికి ఇవ్వొద్దని దాని వలన పిల్లలు చెడిపోతారని అన్నారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాట్రావత్ తావు, ఉపాధ్యాయురాలు అలివేలు, ఎం మహాలక్ష్మీ, శ్రీనివాస్ రెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దీన్‌దయాళ్‌నగర్ విద్యార్థులకు డ్రెస్సులు, పుస్తకాల పంపిణి



**సరూర్‌నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** విద్యా సంవత్సరం ప్రారంభమై పాఠశాలలు తెరుచుకున్న నేపథ్యంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని దీన్‌దయాళ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత స్కూల్ యూనిఫారాలు, పాఠ్య పుస్తకాల పంపిణి జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా సరఫరా అయిన యూనిఫారాలను, పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక 16వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్ యాదవ్, ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి జాబ్ మేళాలు దోహదం : సీఇఓ హోళీధర్ రెడ్డి



స్ఫూర్తి డిగ్రీ కళాశాల నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొన్న విద్యార్థులు తదితరులు

**మలక్ పేట, జూన్ 12, ప్రభాతవార్త:** నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించేందుకు ఉద్యోగమేళాలు ఎంతో దోహదపడతాయని స్ఫూర్తి విద్యాసంస్థల సీఈవో ఎస్. హోలీధర్ రెడ్డి అన్నారు. దిల్ సుఖ్ నగర్ లోని స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. స్ఫూర్తి విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా ఉద్యోగమేళాకు నిరుద్యోగ యువత వేలాదిగా తరలివచ్చారు. విప్రో, టెక్ మహీంద్రా, వర్చుసా, టెలీపర్ఫార్మెన్స్, ఫస్ట్ సోర్స్, గెట్స్, ఏజిఎస్, సాజిలిటీ, ఈఎక్స్ఎల్ సర్వీసెస్, ఐసిఐసిఐ, సైటెల్, సైక్స్, కాన్సెంట్రిక్స్, సిటి సి, వంటి మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులు హాజరై ప్రతిభగల 565 మంది యువతీ, యువకులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా స్ఫూర్తి విద్యాసంస్థల సీఈవో ఎస్.హోలీదర్ రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే సదుద్దేశంతో ఈ మెగా ఉద్యోగ మేళను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సంవత్సరానికి రూ .2.5 లక్షల ప్యాకేజీ తో మొదలుకొని రూ.6.5 లక్షల ప్యాకేజీలతో విద్యార్థులను వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నట్లు ఆయన తెలిపారు. స్ఫూర్తి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతియేటా ఉద్యోగ మేళాను నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ ఉద్యోగ మేళాలను నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతిసారి పెద్ద సంఖ్యలో యువతీ, యువకులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలను పొందటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి విద్యాసంస్థల ఉద్యోగులు, సిబ్బంది, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠాశాలల ప్రతిష్ఠను పెంపొందించే దిశగా కృషి చేయాలి : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం. మే.12.ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యధిక సంఖ్యలో విద్యార్థులు చదువుతూ ప్రయోజకులవుతారని ఆశిస్తూ, ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠను పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు.దీనిలో భాగంగా, గురువారం ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు హాజరై, విద్యార్థులు మరియు విద్యార్థినులకు పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,"ప్రభుత్వ పాఠశాలల్లో కృషి చేస్తోన్న ఉపాధ్యాయులు ఎంతో నాణ్యమైన బోధన అందిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పోటీ ఇస్తున్నాయి. రాబోయే రోజుల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని తెలిపారు.అదేవిధంగా, గత ఏడాది పదవ తరగతి పరీక్షల్లో మెరిసిన విద్యార్థులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దినేష్ కుమార్, నాయకులు సుమన్ గౌడ్, మాధవరం నర్సింహారావు, సతీష్ గౌడ్, గడ్డం మల్లేష్, రాఘవేంద్రరావు,మనోజ్,సతీశ్, కృష్ణ,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.




విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్ : ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**తుర్కయంజాల్ జూన్ 12, ప్రభాతవార్త :** విద్యార్థులు పాఠశాల దశనుండే క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నతంగా ఎదగాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు మరియు దుస్తులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పాఠ్యపుస్తములు యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నతనం నుండి క్రమశిక్షణతో, శ్రద్ధతో చదువుకోవాలని, అదేవిధంగా చదువుతో పాటు ఆటలలో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. తుర్కయంజాల మున్సిపాలిటీలో పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. నేడు విద్యా వైద్యం ఖర్చులు పెరిగి మధ్యతరగతి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం పాఠశాలలో ఎటువంటి ఫీజులు సమస్యలు లేకుండా ఉత్తీర్ణత కలిగిన ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నారని కావున పేద మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అన్నారు.పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధమేనని తెలిపారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి.మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్ పర్సన్ గుండ్ల పల్లి హరిత ధనరాజ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొక్క వంశీధర్ రెడ్డి, ఎండి గౌస్ పాషా, ప్రధానోపాధ్యాయులు టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## తార్నాకలో సందడిగా బడిబాట కార్యక్రమం



విద్యార్థులకు పుస్తకాలు, డ్రస్‌లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి తధితరులు

**తార్నాక, జూన్ 12 ప్రభాతవార్త :** గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు శోభన్ రెడ్డితో కలిసి తార్నాక డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న టెక్స్ట్ బుక్స్, యూనిఫార్ములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం చేపడుతున్న పథకాలు, ఉదాహరణకు డిజిటల్ తరగతి గదులు, సైన్స్, గణితం, ఇంగ్లీష్ ల్యాబ్స్, వృత్తిపరమైన కోర్సులు (బైండింగ్, ఎలక్ట్రికల్, టైలరింగ్), ఉచిత మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫార్ములు, పాఠ్య పుస్తకాలు, ఉచిత వైద్య పరీక్షలు, ఉచిత బస్ పాస్, ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఆరు నుంచి 10వ తరగతులకు కంప్యూటర్ తరగతుల వంటి అనేక ప్రోత్సాహక కార్యక్రమాలను వివరించారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలతో పోల్చి ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాల వల్ల విద్యార్థులకు లభిస్తున్న ప్రోత్సాహాన్ని వివరించారు. పిల్లలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని గొప్ప విజయాలను సాధించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో డిప్యూటీ డిఈఓ బాలు నాయక్, టీచర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్‌లో ముగిసిన మాజీ ఎంపిటిసి రంజిత్‌రెడ్డి అంత్యక్రియలు

### హాజరైన సబితా ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, తీగల కృష్ణారెడ్డి



రంజిత్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎల్‌బినగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి: చిత్రంలో రంజిత్‌రెడ్డి భార్య, కుమార్తెలు ఉన్నారు.

**సరూర్‌నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్‌కు చెందిన మాజీ ఎంపిటిసి, సీనియర్ నాయకుడు తీగల రంజిత్‌రెడ్డి అంత్యక్రియలు గురువారం ఆయన స్వగ్రామం మీర్‌పేట్ స్మశానవాటికలో జరిగాయి. రెండు సార్లు మీర్‌పేట్ ఎంపిటిసిగా ఎన్నికై ప్రజాప్రతినిధిగా, సీనియర్ నాయకునిగా ఇక్కడి ప్రాంతాల అభివృద్ధిలో తనదైన ముద్ర వేసి బలమైన నేతగా గుర్తింపు పొందిన రంజిత్‌రెడ్డి తీవ్ర అస్వస్థతతో గత సోమవారం నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన సంగతి విదితమే. అయితే అమెరికాలో చదుకుంటున్న ఆయన పెద్ద కూతురు రాక ఆలస్యం అయినందున మృతి చెందిన నాలుగు రోజులకు అంత్యక్రియలు జరపాల్సిన పరిస్థితి కలిగింది. కాగా గురువారం ఉదయం కిమ్స్ ఆసుపత్రి నుండి నేరుగా సలీంనగర్‌లోని ఆయన స్వగృహానికి మృతదేహం తీసుకొచ్చిన తర్వాత అంతిమ సంస్కార కార్యక్రమాలను నిర్వహించారు. అయితే సలీంనగర్‌కు చేరుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రంజిత్‌రెడ్డి భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి ఆయన భార్య, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదే విధంగా రంజిత్‌రెడ్డి తండ్రి భాగ్యనగర్ సొసైటీ మాజీ డైరెక్టర్ తీగల సుభాష్‌రెడ్డి, సోదరుడు మలకోపేట్ అసెంబ్లీ బిఆర్ఎస్ ఇంఛార్జి తీగల అజిత్‌రెడ్డి, మూసారంబాగ్ మాజీ కార్పొరేటర్ తీగల సునరిత అజిత్‌రెడ్డిలను పరామర్శించారు.

**సబితారెడ్డి, సుధీర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డిల నివాళి**

అంతిమ యాత్ర మీర్‌పేట్ స్మశానవాటిక వద్దకు చేరుకున్న తర్వాత మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మరోసారి వచ్చి రంజిత్‌రెడ్డికి తుది నివాళులర్పించారు. ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంఛార్జి పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డిలు రంజిత్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల అశ్రు నయనాల మధ్య రంజిత్ అంత్యక్రియలు ముగిసాయి.

## బండ్లగూడ పాఠశాల దుస్థితిపై చలించిన మధుయాష్కీ



కాలనీలో పర్యటిస్తున్న మధుయాష్కిగౌడ్

**ఎల్.బి.నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ బండ్లగూడ లోని ప్రభుత్వ పాఠశాలలో పాత గోడలు, వర్షానికి కురిసే రేకుల షెడ్డు, నేలపై ఎలుకలు చేసిన రంధ్రాలు చూసి మధు యాష్కీ గౌడ్ చలించిపోయాడు. వెంటనే తన జేబులో నుంచి డబ్బులు ఇచ్చి మీరు కూడా సహాయం చేయండి అంటూ తన వెంట వచ్చిన నాయకులు, కార్యకర్తలు అందరికీ చెప్పడంతో అందరి సహాయంతో వచ్చిన డబ్బులతో వెంటనే మరమ్మత్తుల పనులు ప్రారంభించారు. పాఠశాలలో ఇబ్బందులను తొలగిస్తూ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ తనదైన శైలిని చాటుకున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కుర్చీలు, టేబుల్స్ ను తాను పంపిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి నూతన పాఠశాల భవనం నిర్మాణంపై డీఈఓ, ఇతర ఉన్నతాధికాలతో మాట్లాడారు. జిల్లా మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్ తో మాట్లాడి పాఠశాల భవన నిర్మాణం చేయిస్తామని పేర్కొన్నారు. బండ్లగూడ పాత గ్రామంలో నూతన రోడ్ల నిర్మించాలని జిహెచ్‌ఎంసి అధికారులకు సూచించారు. ఓపెన్ జిమ్ పార్కును అభివృద్ధి చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చెరుకు భవాని శంకర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, బుడ్డ సత్య నారాయణ, బీమిడి రామకృష్ణారెడ్డి, చెరుకు జంగయ్య గౌడ్, సహదేవ్ గౌడ్, పంగా గౌతం, తూర్పాటి జగదీష్, నూనెమూతల లక్ష్మయ్య, టి.నారాయణ, కే.రాఘవేందర్ గౌడ్, తూర్పాటి సతీష్, ఎన్. రాఘవేందర్ గౌడ్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి జలమయంగా మారిన కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం

### -చినుకు పడితే ఇబ్బందులకు గురవుతున్న భక్తులు



జలమయంగా మారిన దేవాలయానికి వెళ్లే దారి

**సైదాబాద్, జూన్ 12 ప్రభాతవార్త:** గురువారం ఉదయం కురిసిన వర్షానికి కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ ప్రాంగణం జలమయంగా మారింది. దేవాలయ ముఖ ద్వారం నుంచి రాజగోపురానికి వెళ్లే దారి మొత్తం మోకాలు లోతు నీటితో పూర్తిగా జలమయంగా మారడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దేవాలయానికి వెళ్లే దారిలో నీరు నిలిచిపోవడంతో, లోనికి వెళ్లడానికి వీలులేక భక్తులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. వర్షం పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి తలెత్తుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఇప్పటికైనా స్పందించి సమస్య శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : కార్పొరేటర్



పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 12 ప్రభాతవార్త:** ప్రైవేటు పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. సైదాబాద్‌లోని ఆర్యసమాజ్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ విధ్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ రాధాకృష్ణ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహారెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, విధ్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్




విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, జూన్ 12 ప్రభాతవార్త :** విద్య సంవత్సరం ప్రారంభం, బడి బాటను పునస్కరించుకొని నాచారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించడం లక్ష్యంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారంలను నాచారం డివిజన్ కార్పొరేటర్ గురువారం శాంతి సాయి జన్ శేఖర్ పంపిణీ చేశారు.కార్యక్రమంలో రామకృష్ణ, కట్ట బుచ్చన్న గౌడ్, రామచందర్, దాసరి కర్ణ, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, హరి ప్రసాద్,ఈశ్వర్, యూసుఫ్ కృష్ణ,గణేష్, యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి : ఏఐవైఎఫ్

**నాచారం, జూన్ 12 ప్రభాతవార్త :** బాలల ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులతోపాటు సమాజంపై ఉన్నదని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్‌లు తెలిపారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంను పురస్కరించుకుని బాలసంఘం మరియు ఏఐవైఎఫ్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మల్లాపూర్ లోని ప్రభుత్వ పాఠశాలలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం భావి భారత పౌరులు ఉండాల్సింది పనిలో కాదు బడిలో అనే నినాదంతో చిన్నారులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ..ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, బాలసంఘం కన్వీనర్ అజీమ్ పాషాలు మాట్లాడుతూ మన దేశంలో 14 సంవత్సరాలు లోపు బాల బాలికలతో ఎలాంటి పనులు చేయకూడదని బాల కార్మిక వ్యతిరేక చట్టాన్ని 1986 లో దేశంలో తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి, బాబూరావు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి బాబు, నేతలు ప్రీతం, సంజు, వికాస్ రెడ్డి, ఆఫ్రోజ్, షోయబ్, సమీర్, మోనిన్, అఖిల్, సత్యం, ఇర్ఫాన్, సల్మాన్, వంశి పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి



బి.జె.పి.ప్రొఫెషనల్ మీట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న బంగారు శృతి.

**వనస్థలిపురం. మే.12.ప్రభాతవార్త.** ప్రధాని మోడీ నాయకత్వం లో గత 11 సంవత్సరాల పాలనలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందని బి.జె.పి.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమారి బంగారు శృతి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలననుతపురస్కరించుకుని సంకల్పంతో సహకారం... ప్రొఫెషనల్ మీట్ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా బి.జె.పి అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన హయత్ నగర్ డివిజన్ లోని హుడా సాయి నగర్ కమ్యూనిటీ హాల్ లో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శృతి మాట్లాడుతూ ప్రధాని 11 సంవత్సరాల పాలనలో దేశంలో గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు.మరో అతిథి అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ ప్రజలు మోడీ పై అపారమైన గౌరవం కలిగి ఉన్నారన్నారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ,ఎల్.బి.నగర్ బి.జె.పి.ఇంచార్జ్ సామ రంగారెడ్డి, కార్పొరేటర్ లు కళ్ళెం నవజీవన్ రెడ్డి,మొద్దు లచ్చిరెడ్డి, వంగ మధుసూదన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి, కళ్లెం రవీందర్ రెడ్డి, బందారి భాస్కర్,శ్యామల, గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు

**ఎల్.బి.నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** గడ్డిఅన్నారం డివిజన్ లైవ్ తీర్థ నగర్ కాలనీలోనే శ్రీవీరవెంకటసత్యనారాయణస్వామి వారి దేవాలయం 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శత ఘట్టాభిషేకం 108 వెండి కలశాలతో 108 మంది దంపతులతో జైష్టభిషేకం పుష్పాభిషేకం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం తదితర కార్యక్రమాలను వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ లింగారెడ్డి,పూర నరసింహగుప్తా, చకిలం రమణయ్య, చిదర నాగేందర్, వక్కలంక శ్రీనివాస్‌రావు, బచ్చు సత్యనారాయణ, ప్రొద్దుటూరి కుమారస్వామి, పాల్థి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ బోధన



పుస్తకాలు అందజేస్తున్న దయానంద్ గుప్తా, పవన్ కుమార్

**ఎల్.బి.నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో అనుభవాగ్నులైన ఉపాధ్యాయులతో ఉత్తమ బోధన ఉంటుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పేర్కొన్నారు. మన ఊరు మన బడి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా కొత్తపేట డివిజన్ జిల్లా పరిషత్, ప్రైమరీ, మండల పరిషత్, మోహన్ నగర్, శివమ్మ నగర్ పాఠశాలలోని కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నూతన పాఠ్య పుస్తకాలు, నూతన యూనిఫాంలను అందజేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని పాఠశాలకు, తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, శంకర్, ఆంజనేయులు, ఉపాధ్యాయులు నాయకులు మంచి రాజేష్, నిరంకి రవి, తోట మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్-నాదర్‌గుల్ రోడ్డు నిర్మాణంలో జాప్యంపై బిజెపి ఆందోళన



నాదర్‌గుల్ రోడ్డుపై వంటా వార్పుతో నిరసన కార్యక్రమం చేస్తూ బైఠాయించిన బిజెపి నాయకులు

**సరూర్‌నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ నుండి నాదర్‌గుల్ వరకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరిగి సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా పనులు ప్రారంభించకపోవడాన్ని నిరసిస్తూ గురువారం బిజెపి ఆందోళనకు దిగింది. ఈ మేరకు నాదర్‌గుల్ బిజెపి శక్తి కేంద్రం ఇంఛార్జి నిమ్మల రవికాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నాదర్‌గుల్ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఇందులో భాగంగా రోడ్డుపైనే వంటా వార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రోడ్డు పనులను ప్రారంభించాలి.. కమీషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో ధర్నా జరుగుతున్న ప్రాంతానికి వచ్చిన కమీషనర్ సరస్వతి ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పదిహేను రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీనివ్వడంతో వారు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కిసాన్‌మోర్చా నాయకులు ఏనుగు రాంరెడ్డి, భాగ్యనగర్ సొసైటీ మాజీ చైర్మన్ పెత్తుల్ల పుల్లారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ ఏనుగు వెంకట్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, మర్రి అంజిరెడ్డి, మర్రి ప్రభాకర్‌రెడ్డి, పాలుబాయి లక్ష్మణ్, మాజీ కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేన, నాయకులు నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి, నాయకులు యాతం వెంకటేష్ యాదవ్, మోతకాని పెద్దయ్య, వంక ప్రభాకర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రైతులకు మేలు జరిగేలా సహకార సంఘాలు పనిచేయాలి : ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి



అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బాటసింగారం సహకార సంఘం ఆవరణలో ఎరువులు గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 12, ప్రభాతవార్త :** ప్రతి రైతుకూ మేలు చేసే విధంగా సహకార సంఘాలు పని చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ఆవరణలో రూ.16లక్షల వ్యయంతో నిర్మించిన ఎరువుల గోదాంను సహకార సంఘం ఛైర్మన్ చేగూరి భరత్‌కుమార్, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డిలతో కలిసి గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సహకార సంఘాలు రైతులకు తెలియజేస్తూ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఛైర్మన్ భరత్ కుమార్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఎరువుల గోదాంగా కొనసాగుతున్న భవనం జాతీయ రహదారి విస్తరణలో కోల్పోతున్న కారణంగా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రూ. 16 లక్షలు సహకార సంఘం నిధులు వెచ్చించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నూతన గోదాం నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ, సంఘం వైస్‌ఛైర్మన్ నార్లకొండ మల్లమ్మ, హయత్‌నగర్ సింగిల్ విండో ఛైర్మన్ చామ కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ఛైర్మన్ భాస్కర్‌చారి, నాయకులు బుర్ర మహేందర్‌గౌడ్, బింగి దాసు గౌడ్, మహ్మద్ గౌస్ పాష, డైరెక్టర్లు మొగుళ్ల యాదిరెడ్డి, పగిళ్ల బాల్ రెడ్డి, బిజిలి బాలనరసింహ, గంట శ్రీనివాస్ రెడ్డి, ఇటుకల మహేందర్ రెడ్డి, కొత్తపల్లి జైపాల్ రెడ్డి, మేకల రాములు యాదవ్, కందాడి మహిపాల్ రెడ్డి, మేనేజర్ జక్కుల ఐలేష్ యాదవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.